
# మ్యానరికం

ఎంతలేదన్న లక్ష్మికి పదేండ్లొచ్చెగద నిరుడు నేను బతుకమ్మ పండుగకు పోయినప్పుడే పిల్ల అంబటిపైమీద పన్నెండుఏండ్లోలె గన్పడ్డది. అవును మరి! అందుట్ల ఆరేళ్లమూడేళ్లోళ్లు ఏవరుండరని! అన్న నిఱువెడు మణిషిగద! ఇగ పదినెమట్కు ఏం తక్కువదిన్న దని; తండ్రి నెయ్యిగారంగ గార్వంగ బెంచె మరి! ఆసాలే పెద్దోర్ళసాఱు ఏమొ! ఏం సాలో ఏమొ! తల్లిగారు తల్లిగారని నాకు గొట్టపోతదిగని. ప్రాణర్తివాకం తోటి ఒక్కనాడన్న బండిదోలిందా? నన్నుదోల్కరమ్మని; ఏందో కడుపులలేంది కాగలిచ్చుకుంటె వస్తదా? అంట! అట్లని పొకుండఉండెటట్ల లేకపాయె గద! చూస్త చూస్త మ్యానరికం ఏట్లావోగొట్టుకో వాలె? అందుట్ల పోరి ఏం కురూపిదా? దబ్బనిమ్మపం డసొంటిపిల్ల తోడవుట్టినతోడు మా అన్నమాత్రం బక్కసిక్కినోడా? ఇంటిబలం వొంటిబలం గల్లోడే. గిన్ని బిట్టులు జూసుకొనే మావొదినెదొరుసాని మిట్టెక్కికూసున్నది. లేకపోతే ఆడిపిల్ల ఉన్నోళ్లకు ఇంతబింక మేందీ అంట?

అయ్యో అట్లని నేను బిట్టుపెటుకోని కదులకుండ గూసుందమంటె మా ఆడివిల్లపిల్ల ముక్కిడిముక్కు సుబ్బిని ఇస్తం ఇస్తమని వాళ్లు ఆసువోసినట్లు చిర్గవట్టిరి మావోళ్లుగూడ ఎంతని వోపికెవడ్తరు? నాకు నా వోళ్ల మీద ప్రాణం గొట్టుకున్నట్లు తనకు తనరక్తసమందం మీద గుంజదా మరి? ఏకువోయి మేకైతే కష్టం కొమ్మైగొంగంది మానైవొంగుతదా? అన్నరు.అందుకోసం యామొజ్జింపులులేకుండ ఇప్పుడే దేల్చుకోవాలె. రేపులేదు ఎల్లుండి పండుగ రానే వచ్చె గదా! పండుగకు వోయినట్లుంటది ఈమాట గదితిచ్చి

వాళ్ళమణుసులు దెబ్బకున్నట్లుంటది. ఇందుట్ల నా కొచ్చిన తలొంపులు యాడుండవి?" అని మనసు గుదిరిచ్చుకొని, రాత్రోరాత్రి కావలివోతున్న కత్తెస్సను మాన్పిచ్చి కొట్టంకాడిక్కదర్మింది కములమ్మ.

"మోట్లుగొట్టెపొద్దుకే బండి మనఇంటిఎదురుగ సిపాయిలమీద ఉండాలె. పగ్గాలు, పలుపులు, మెడదుత్తలు పశులమాలెల పెద్దగుమ్మిఎన్క ఉండవి. ఇప్పుడే దెచ్చి దులిపిపెట్టుకో, మరి బండికి కందెన ఏసి బుర్కవెట్టాలె. తొట్లె వెట్కం మరిశేరు నాయినో! తొట్లెనిండుగ గడ్డి బాగమెత్తగనింపి, జంఘానపరువుండి, రొండుదిక్కుల మెత్తలువెట్టునిర్రి, బండికి పెద్దనవారిపడ్లు గట్టకుండ. అవి మీ దొరకే పసందు. లగేసెనంటె మిట్టువల్లంజూడకుండ ఉర్కుతవి. అందుకే నా బండికి మన రాములును, గోపాలును గట్టుండి, ఎడ్లకు గజ్జెలపట్టెలు గట్టుడుమర్సేరు. అయ్యో! నా ధ్యాసపాడుగాను! పర్దాలకు తాళ్ళుతెగినసంగతే మర్సిన. అవిట్ని గట్టిగగుట్టిత్త మన్న సోయేలేకపాయె. వాట్ని ఇప్పుడే గొంచవోయి తుర్తుల గుట్టియ్యమని సిప్పసిన్నమ్మకు ఒప్పజెప్పిరావాలె బిడ్డ! మా ఇంటి ఆడివిల్లలందరు ఎన్కట మ్యానల్లనే రాకపోకలు చేసేటోళ్ళుం. యాదో మరి! నేను పరదాలబండ్లెనన్న ముద్దుగ వోకపోతె ఎట్ల? ఏందో నా కీపీకులాట? గట్టుగూలంగ గంగెద్దు ఆనవట్టిందంట. పాః పడికట్లన్నివోతుంటె, తుట్టుబుట్టుమనిబస్సులవోక ఎందుకీ తీరుమాణం రాజీర్కమని మాదొర దీరాలుదీస్తడు. ఆయనకేంది? మస్తుజెప్పొచ్చు. తనమీద యాడ బరువు వత్తదో అని తప్పిచ్చుకతిరుగె మాటలు! ఇంతకు గామాత్రం సుదరాయించుకోలేననుకున్నడో ఏందో?" అని ఇంటినిండ గునగుననడ్పుకుంట చెప్పె టోళ్ళకు పను లన్నిజెప్పింది. నాల్గుదినాలకోసం ఆడివాప రాజమ్మను వంటవార్పు జూస్కొమ్మని వొప్పగిచ్చింది.



ఎక్కడిపను లక్క దయిసంక గుడ పెరిసగంరాత్రిదాంక పెద్దెక్కవెట్టుకోని. పాఱుగాసి. కోపముద్దజేసి. తోషదాన్ల నింపుకున్నది. తిజోరి దెరిసి సవురకుప్పె. నాగురం. శికెబిల్ల. చెంపసరాలు. పోంచీలు. బన్నిసరం దీసుకోని పెట్టుకున్నది. పెట్టెలసీర దీసికట్టుకోని.బిల్లసరాలరైక వొడిగింది. కొడ్కు తిరుపతికి సఱువజేసినఅంగి దొడిగిచ్చి తెల్లారెట్యాళ్ళకు "పోయొస్త. పదిలం ఇల్లు!" అని అనుకుంట బండెక్కి పయినమైంది.

అప్పుడే భోజినంజేసి బిడ్డలక్ష్మిని పక్కలవెట్టుకోని నడిమిఇంట్ల ఉయ్యాలమీద గూసున్నడు కేశవయ్య. ఎక్కడివక్కడసదురుకోని పెండ్లాం రాదమ్మగూడ వొంటింట్లకెల్లి వొచ్చి. తడిచేయి కొంగుకు తూడ్సుకొని పక్కల్నేఉన్న అరాంకుర్సీమీదగూసున్నది.ఇంతట్లనే మూలమల్పునబండిని అళ్ళిచ్చినసప్పుడు. ఇగ ఆ గజ్జెలబండి తమ వాకిట్లనే ఆగిన సప్పుడైంది. అది యిని కేశవయ్య 'ఎవరబ్బ! గీయాళ్ళటప్పుడు గజ్జెల బండిల వచ్చిందీ?' అని అంటుంటే. 'ఆఁ! ఇంగెవ రుంట రండి! మీ చెల్లెలుదొరుసాని ఉంటది.' అని రాదమ్మ ఆరాంకుర్సీలకెల్లి లేసింది. కేశవయ్య బిడ్డసెయ్యి సేతులవట్టుకోని పోయి పస్గడదెరిసిండు. నిజంగరాదమ్మ జెప్పినట్లు చెల్లెలుకములమ్మనే వచ్చింది.

"అరె! నీవా? కములా! అదేందే సెప్పక సెయ్యక వచ్చినవ్? జా వేడి? కారటన్న రాపియ్యగూడదా? సామాను మీ వొదిన జూసుకుంటుందిలే! దిగు! అరే, తిరుపతి! ఏందిరా? మూలకునతికినవు? ఊఁ దుంకు బండి.బేటా లచ్చన్న! అగో సూడు ఎవరొచ్చిన్రో?" అనుకుంట చెల్లెల్ని బండిదింపుకున్నడు. ఇంతట్లనె పనిమనిషి చెంద్రమ్మవొచ్చి బయటిచెంబుల నీళ్ళుపోసి.కాళ్ళకునీళ్ళిచ్చింది.సఱువతువాల దండెంమీదేసి సబ్బువెట్టింది. ఆడివిల్ల కములమ్మ దబదబ కాళ్ళుగడుక్కోని "అంశపంతరాలవమ్మవొదినే! సక్కనిబిడ్డను గన్నవ్. రాంగరాంగ

లక్ష్మి చిల్కతీర్గ అయితుండది." అని గద్వపట్టుకొని ముద్దాడుతుంటె. "ఈ పిల్లకంత మీసాలె వచ్చింది వొదినె నగుతె అచ్చం మ్యానత్తనే అని వాళ్ళనాయిన అంటడు" అని రాదమ్మ కలెగల్పుగమాట్లాడి, ఆడిబిడ్డకు జర్పాల్సిన మర్యాద లన్ని జరిపింది.

రాదమ్మ పట్నవాసం ల పెరిగింది. జాగసదువుకున్నది. అందుకే వసరాపండుగనుసాదగనెజేతమనుకున్నదిగని.ఆడివిల్ల ఊరికెల్లి పిలువకుండ గనె తనంతట తాను తల్లిగా రిల్లసొచ్చుకొని వొచ్చినందుకు అయింటి సిరస్త పోనియ్యగూడదు, అబ్బో! మా కమలమ్మ ముక్కుమీద ఈగెవాలె ముక్కుగోసేసుకొనేబంటు.ఎందుట్ల గూడ ఏరుతారు రానియ్యగూడదు అని కేశవయ్య అప్పుడుగాదిప్పు దని మనిషిని దరిమి తంగెడుపువ్వ గునుగుపువ్వ. ర్యాలెపువ్వ. బంతిపువ్వ ఇంగ అన్నిపూలు సంచులకొద్ది తెప్పిచ్చిండు బతుకమ్మను సింగారిచ్చ; రాదమ్మ అటుకమీదికెల్లి పెద్దతాంబాళం దీపిచ్చింది. పట్కరిపరుమయ్యవొచ్చి గులాలురంగు. నీలిరంగు. చిలుకపచ్చ, బీరపచ్చరంగుల పొట్లాలుదెచ్చి, గుంతచిప్పల ల్లగలిపి దూదిపిడ్చ లేసిండు. కమలమ్మ వాకిట్ల అలికిపూసినతాన పియ్యపుపిండితోటి కములందీర్చింది,నడింట్ల ఈత సాపలగూనోని రాదమ్మ వొప్పెగ గున్గుపూలన్నిటికి రంగులేసింది. ఇంతట్లనె కములమ్మొచ్చి బతుకమ్మను కండ్లకుపండుగయ్యేటట్లు పేర్చింది. పిల్లలిద్దరు త్యాప కింత రోపముద్ద దినుకుంట ఆటలవడిను.

ఒప్పులకుపోలెలెఅలంకారంజేసి పసుపుకుంకుమల్తోటిపూజిచ్చిన బత్కమ్మను జూసి కేశవయ్య "రాదా:చూడె.మాచెల్లెమ్మచేతుల ఎంతపనితనం ఉందో?" అని మెచ్చుకుంటుంటె, ముసిముసి నగులు నగుకుంట కములమ్మ "ఊకో అన్న ! వొదినె అల్కపాన్పుఏసిగిట్ల :"అంటె,రాదమ్మ కొంటెకొమ్మతీర్గ కేశవయ్య మొకంలకు జూసి "అయ్యో : ఎవ్వరిపెరటిపువ్వ వాళ్ళకు

పాసనగాదామరి? ఎవ్వరి ఎచ్చులువాళ్ళవి" అని అంటుంటె అందరు గలగల నవ్వుకున్నరు.

ఇంగ బోజినాలయి నంక తీరువాటంగ కములమ్మ గూసోని, లక్ష్మిని విల్సి ముందలగూసోవెట్టుకొని, రొండుజడలిడ్సి ఎంటికెలు పాపిపాపి ఊదునూనె మెలుగువెట్టింది. ఒంటిజడేసింది. పూలగొట్టంతోటి జడనిండ పూలుగుచ్చింది. చెవులకు గున్నాలువెట్టింది. చేతులకు కాకరకాయగొలుసులు వెట్టింది. మొకానికి పోడరువేసింది. కాల్కె కడకొళ్లులు దాటంగ దిద్ది,సాదుసుక్క వెట్టింది. ఇట్ల పిల్లనుతీర్చినబొమ్మోలె జేసి కములమ్మకోడలిగదువ చేతులకుదీస్కోని 'నా పండు ! చంద్రదీపం !' అని ముద్దిచ్చుకొని, "సీవిట్లజగ్గే" అని, "తిరుపతి, నీ వింగ రాబిడ్డ !" అని తిరుపతిని విల్సి ముంగల గూసో వెట్టుకున్నది. ఇప్పుడు తిరుపతికిగూడ ఎంకటేశ్వర్ల మొక్కుకొరకుంచిన 'ఎంటికలు పెద్ద గయినవి. తిరుపతికిగూడ లక్ష్మికి మెరుగువెట్టినట్లే ముందలగూసోవెట్టుకోని నూనెవెట్టి దువ్వి జెడేసింది. కొనాకు ఎట్టుఉలనుగట్టింది. సలువజేసిన లాగు దొడ్గి దానిమీద ఎట్టుబనారసుపూలకోటు దొడిగింది. మెళ్ళ అసిలివెట్టింది. చేతులకు జంగారుముర్గులు వెట్టింది. బొమ్మలసందున సన్నగ సాదుసుక్క వెట్టింది. ఇట్లా తయారుజేసిన తిరుపతిని జూసి లక్ష్మి నగుకుంట ఇంట్లకు ఉరికి "అమ్మా! బావ బావగాడే. ఆడిపిల్లనే. నాకంటె పొడుగు జెడేసుకున్నాడు. పూలపూల అంగిదొడుక్కున్నడు" అని చెప్పుతుంటె, "లక్ష్మి,అట్లనొద్దమ్మ. బావను అత్త పండుగనాడు కొడ్కుకు ఎన్కటిపోషాకు దొడ్గి తీరొక్కతీరున సూసుకుందమని అట్ల సోకుజేసింది. నాకు గూడ మొన్న మొన్నటిదన్క కాలుకు పేడి, చెవులకు పోగులు. కొన్కపోగు ఉండె. మీయమ్మ బయానికి దీసిన." అని కేశవయ్య అంటుంటె, రాదమ్మ "అయ్యో నా బయ మెందుకొచ్చెనడుంగల? ఇప్పుడు మునిగిపోయిం దేముండది

కలం దాండ్లకెళ్ళి దీపి మళ్ళవెట్టుకో రాదుండి, సూడసక్కనుంటది ఏళం" అని అన్నది.

ఇంతట్లకె కొడుకును సింగారిచ్చి దిష్టిదగుల్తదని మిటికెళ్ళిరిసి అరికాలిదుమ్ముదీసి ఎవ్వరుజూడకుండ దబ్బున పొట్టకు రాసి "నా తండ్రి కృష్ణమూర్త్యోలె ఉండడు. ఇప్పు డడ్గులె మీ మామను, అత్తను. ఏమంటరో?" అని పక్కకు మళ్ళి "పిల్లా, లక్ష్మి, యెక్కడవోతివే! అదే తిర్పతి పో బిడ్డ. నీ పెండ్లాన్ని పిలుసుకరా పో," అని అన్నది కములమ్మ. ఇగ రాదమ్మ ఈమాటయిని మొకం చిట్లిచ్చుకొని "వొదినే. అవేంమాటలమ్మ? ఆపిల్లలు జానెడులేరు; జిట్టెడులేరు. అప్పుడే. వెద్దోళ్ళం మనం మొగడు పెండ్లాం అని నేర్పితె రేపు ఎవరి అదృష్టం ఎట్లుండదో, ఎవరికి ఎక్కడప్రాప్తెం ఉండదో, ఏమొ ఎవరికెర్క మీకు కోపంవచ్చినా సరే. నాబిడ్డను మాత్రం అట్లపిలువకుండి." అనిఅన్నది. తల్లి ఈమాట లంటుంటె పిల్ల అవేం ఇనిపిచ్చుకోకుండ "అమ్మా! సూడే నేను అవద్దం జెప్పితె బావ ఆడిపిల్ల నే నే, ఆ జడజూడమ్మా." అని వప్పట్లుగొట్టుకుంట ఎగిరింద.

రాదమ్మ మాటలు ఇన్న కములమ్మకు ఎక్కడలేనిరోసంముంచుకొచ్చి "అయ్యో! మాటనంగనె మీ కంతకష్టమైనా దుర్ల. ఈసారి ఈ పమందం పండోకాయో తేల్సకపోదామని వొచ్చినగని పండుగపూటల్ల నాయిల్లుఇడ్సి నీయింట్ల బషాలు, లడ్డూలు దినేటందుకురాలేదు. మ్యానపిలగాడు ఉండంగ పరా యోడు పిల్ల నడిగే టందుకు ఎట్లొస్తదో జూస్త. వచ్చే టోడువాస్తే ఇచ్చేటోడెట్ల ఇస్తదోగుడజూస్త. కొంగువర్సుకోని కడపలల్లవండుకుంట.

నామీదకెళ్లి దాటుకుంట పిల్లనుగొంచవోవాలె. ఏమనుకున్నరో మరి? నిండుపండుగ నాడు నీయింటికొస్తె కండ్లకద్దుకోని పిల్లనవందం గట్టిజేస్తరనుకున్న. నా కొడుక్కు నూగ్గాడోలె పెర్గుతుండె. వాణికేమి కన్నొంకర్నా? కాలొంకర్నా? వాళ్ళతండ్రికేం తక్కువ అనా? భూగంలేనోడా? బలంలేనోడా? యాడో! నేను నావోళ్ళని విడ్సి నీ యిల్లుజొచ్చుకొచ్చి మా అంతట్లమేము పైటవడిపల్లైనైనం ఆడిపెద్దిర్కంతం బళ్ళదొరతనం అని మొగోళ్ళను పిగమీరొచ్చి ఇప్పుడు నగటోళ్ల ముందల జారిపడ్డల్లెతి. ఒక్క గడియ సేపునిలుపను. నాకొడ్కు మీకండ్ల కానంది మీ యింట్ల నేనెందుకు? అమ్మవోయిన్నాదె అంతమునిగింది. ఇంతటితోటి తెగదెంపులు. నీ కడ్ప నేనుదొక్కను. పోత. అని దుస్సు బుస్సుమనుకుంట వోయి—

తిరుపతి! యాడున్నవుపోరగా, రా రా! అని పిలుస్తుంటె, పిల్లగాడేమొ బిరబిరవోయి తల్లేసినజడ గత్తరిచ్చుకోని, ఇంటెన్క మల్లెపందిరికింద గద్దె మీదగూసోని జెడకొనాకు గట్టినఉలనుతోటి లక్ష్మి ఇంగ వాడు ఏళ్కవాలఆట ఆడుకుంటగూసున్నరు. అట్లగూసున్నవాణ్ణి జూసెటాల్యకు కమలమ్మకు కడుపుమసిల్నట్లైంది. కొడ్కును అమాతం గుంజుకోని, ఎద కద్దుకోని, "ఇదేందిబిడ్డ! దేవునిమొక్కు బడిగద కొడ్కా? నీకెందుకంత నాదానివాచ్చె నాయినా? ఆపోరి నీడ నీమీద వడొద్దు. ఇదే గట్లైతె ఇంగేం అయితుండెనో; ఏందో! ఈసారిసెకే రావద్దు మనం. పా! బిడ్డ, మనూరికి." అని శేపుతుంటె, "అమ్మ, నేనురానే, ఈణ్ణేఉండి సదువుకుంటనే. అత్తదగ్గర్నె ఉంటనే." అని అంటున్నకొడ్కును గుంజుకపోతుంటె, లక్ష్మి ఏడ్సుకుంటొచ్చి, "అత్తా, నేనొస్త నీఎంబడి బావనుజూసి నగను, జుట్టు గత్తరియ్యను ఆడిపిల్ల అనను. నీ వేమన్నగని మా యమ్మకు జెప్పను. బావ నన్ను పెండ్లాంఅనే పిలువని, నన్ను దొల్కవో బావదగ్గర్నె ఉంట." అని నడుంబట్టుకోని యాళ్లాడింది.

ఇదిజూసి కేశవయ్య "ఏంది కములమ్మా ఇది ? చూడుతల్లీ ; ఈ పూటకు ఉండు. పసిపిల్లలు దేవుండ్లసుంటోళ్ళు. నిదానంజేయి. అంత తామసంవొద్దు." అని గదువవట్టుకొని అడుక్కుంటుంటె, రాదమ్మ "వొదినె, పట్టుఇడువుండి. దేవునిదయ రేపు ఎట్లా జరుగాల్నని వుంటే అట్లా జరిగితీర్తది. మనమెవ్వరం ముడేసె టందుకు, ఇడ్సె టందుకు ?" అని దండంబెట్టింది.

ఇగ ముగ్గురు కండ్లు దుడ్సుకుంట పిల్లలసేతులు వట్టుకొని ఇంట్లకునడ్సిన్రు.

